“పదహారేళ్ళుగా రానిది వారం రోజుల్లో ఏకాగ్రత వస్తుందా మామయ్యా. జ్ఞాపకశక్తి కావాలంటే బాగా చదవమను” అందామనుకుంది. కానీ ఆయన ఆశని ముందే చంపెయ్యటమెందుకని “అలాగే వెళ్దాంలే మామయ్యా. అక్కడ కాంపౌండరు నాకు బాగా తెలుసు” అంది.

ఆ సాయంత్రం ముగ్గురూ క్లినిక్‌కి వెళ్ళారు.

అంతకుముందు చంద్రయ్య భార్యని తీసుకుని పక్క డాక్టర్ దగ్గరికి వెళ్లింది. ఆయన చాలా మంచివాడు. అనుభవం వున్నవాడు. ఆవిడని పరీక్షించి టెస్టులు వ్రాసిచ్చాడు. రిపోర్టులు వచ్చాక ట్రీట్‌మెంట్ మొదలుపెడదామన్నాడు. తల్లినీ అత్తయ్యనీ వాటికోసం పంపించి, అక్కడ నుంచి మైండ్ మాగ్నో క్లినిక్‌కి వెళ్ళారు ముగ్గురూ.

యధావిధిగా చాలా రష్‌గా వుంది క్లినిక్.

తండ్రీ కొడుకుల్ని బయట కూర్చోబెట్టి లోపలికి వెళ్ళింది మధూహ. ఆ చనువు ఆమెకెప్పుడూవుంది.

లోపల కన్సల్టింగ్ గదిలో రాజు లేడు. దాని పక్కనే ఒక చిన్నగది, మంచమూ వున్నాయి. ఒక తెర మాత్రమే రెండింటికీ అడ్డు.

ఆ చిన్న యాంటీ రూమ్‌లో పేషెంట్‌తో మాట్లాడుతున్నాడు. ఆమె పక్కమీద పడుకుని అతడి ప్రశ్నలకి సమాధానం చెపుతోంది.

మధూహ గదిలో ప్రవేశించిన సంగతి తెరకి అవతలగావున్న వాళ్ళిద్దరికీ తెలీదు. సాధారణంగా ఒక పేషెంటు గదిలో వుండగా మరెవరూ ప్రవేశించరు.

మధూహ ఎదురుగా కుర్చీలో కూర్చుని మాగ్‌జైన్ చేతుల్లోకి తీసుకుంది.

“అయితే మీకు చాలా నిరుత్సాహంగా వుంటోందంటారు”

రాజు కంఠం తెర అవతల్నుంచి వినిపిస్తోంది.

"అవునండీ.  నాలుగైదు సంవత్సరాల్నుంచీ ఇలా వుంటోంది. గుండెల్లో దడ. ఏమీ తోచదు. దేనిపట్లా ఆసక్తి వుండదు. చచ్చిపోవాలనిపిస్తుంది" పేషెంటు చెపుతోంది.

క్లియర్ కేస్ ఆఫ్ డిప్రెషన్ అనుకుంది.

చేతినిండా పని లేక చేస్తున్న పనిపట్ల ఉత్సాహం లేక ఒక గమ్యమూ గుర్తింపూ లేని గానుగెద్దు జీవితం వలన ముప్పయి అయిదేళ్ళు పై బడిన వ్యక్తుల్లో ముఖ్యంగా స్త్రీలలో వచ్చే మానసిక వ్యధ.

దీనిని సైక్రియాటిస్టులు కూడా ట్రీట్ చేయగలరు. కేవలం దినచర్య, ఆలోచనా విధానాల్లో మార్పుల వల్ల మాత్రమే ఇది ముఖ్యంగా సాధ్యమవుతుంది. వారిచ్చే సలహా కూడా అదే.

రాజు నమ్మకంగా చెప్పాడు "మా మాగ్నో మైండ్ థెరపీ వలన అది పోతుంది. మీరు మామూలు మనిషి అవుతారు. మీలో కొత్త ఉత్సాహం నిండుతుంది".

"ఎలా డాక్టరుగారూ?"

కాంపౌండర్ డాక్టరయినట్టు చెప్పడం పట్ల మధూహ విస్మయపడింది.  రాజు మామూలుగా చెప్పుకుపోతున్నాడు.

"మా మాగ్నెట్‌తో మీ మెదడులో పదిహేను సంవత్సరాల క్రితం వున్న జ్ఞాపకాల్ని ముందుకు తెస్తాం. అంటే మీ వయసుకు పదిహేను సంవత్సరాలు వెనక్కు తీసుకువెళ్తామన్నమాట. ఆ హుషారు, చురుకుదనం ఇక మీలో అలానే వుండిపోతాయి".

"నిజంగానా డాక్టరుగారూ ...... "

"మీరు పరీక్షించి చూసుకోవచ్చు"

"ఫీజు?"

“అయిదువేలు”

మధూహ గాఢంగా శ్వాస వదిలింది. ఫీజు విషయమై ఇద్దరికీ చర్చ జరుగుతోంది.

చివరికి వెయ్యిరూపాయలకు సెటిల్ అయింది. రెండు నిముషాల తరువాత రాజు కన్సల్టింగ్ గదిలోకి వచ్చాడు. అక్కడ మధూహని చూసి క్షణం బిత్తరపోయాడు. తేరుకుని “ఎంత సేపయింది వచ్చి?” అని అడిగాడు.

“ఇప్పుడే” అంది.

“సారీ, నీ అనుమతి తీసుకోకుండా చనువుగా వచ్చి కూర్చున్నా” నంటూ మధూహ తనొచ్చిన పని చెప్పి సోమాన్నీ చంద్రయ్యనీ లోపలికి పిల్చింది. రాజు సోమయ్యని రెండు మూడు ప్రశ్నలడిగి చంద్రయ్యవైపు తిరిగి “మీ అబ్బాయిని డాక్టర్ని చేసే బాధ్యత మాకు వదిలిపెట్టండి” అన్నాడు కాన్ఫిడెంట్‌గా.

చంద్రయ్య మొహం విప్పారింది. నోటమాట రాక చేతులెత్తి నమస్కరించాడు.

రాజు అన్నాడు “ప్రతీ మనిషిలోనూ నిక్షిప్తమైన శక్తి వుంటుంది. అందులో కేవలం పదోవంతుని మాత్రమే వాడుకుంటాడు. మిగతా తొంభైశాతం వృధా అయిపోతూ వుంటుంది. దాన్ని బయటకి తీస్తే ప్రతీమనిషి ఒక గొప్ప సైంటిస్టు అవుతాడు. జీవితంలో పైకి వస్తాడు. జ్ఞాపకశక్తి అనేది ఒక గదిలాంటిది. తవ్వేకొద్దీ బంగారం దొరుకుతుంది....”

ఏది ఏమైనాకానీ ఇతడిలో ఒక గొప్ప శక్తి వుంది. అవతలివారిని తన మాటల్తో కట్టి పడేసే శక్తి అది అనుకుంది మధూహ.

సోమం అప్పుడే డాక్టరయిపోయినట్టు కల గంటున్నాడు.

“సాధారణంగా దీనికి మూడువేలు తీసుకుంటున్నాం. మీరు మా మధూహ బంధువులు కాబట్టి రెండు వేల అయిదొందలకే ట్రీట్ చేస్తాం, సరేనా?” నవ్వుతూ అన్నాడు.

మధూహ ఏదో చెప్పబోయేటంతలో చంద్రయ్య "సరే బాబూ. అలాగే" అన్నాడు నమ్రతగా.

అసిస్టెంట్ ముగ్గురికీ టీ తీసుకొచ్చి ఇచ్చాడు.

"ఈ రోజునుంచే ప్రారంభిద్దామా?" అంటూ రాజు లేచాడు. మధూహకి సంతోషమేసింది. తను తీసుకు వచ్చినందుకు ఆ మాత్రం ఇంటరెస్టు చూపించి ట్రీట్‌మెంట్ చేస్తున్నందుకు.

కేవలం  తన ముందు 'ప్రతిభ' నిరూపించాలనే అతడు ఈ విధమైన ప్రత్యేకత చూపిస్తున్నాడని ఆమెకి తెలీదు.

సోమాన్ని కుర్చీలో కూర్చోబెట్టి తలకి హెల్మెట్ పెట్టి స్విచాన్ చేశాడు రాజు. సన్నటి శబ్దం మొదలైంది.

అందరూ చూస్తూండగానే సోమం మత్తులోకి జారుకున్నాడు.

మధూహ అవాక్కయింది. అది కలో నిజమో అర్థం కాలేదు. రాజు ఆమె వైపు క్రీగంట చూసి, చిన్న మాగ్నెట్ తీసుకుని, సోమం వెన్నెముక మీద నుంచి మెడవైపు రాయసాగాడు.

చంద్రయ్య ఒక అద్భుత దృశ్యాన్ని చూస్తున్నట్టు కొడుకు వైపు చూస్తున్నాడు.
రెండు నిమిషాల్లో ట్రీట్‌మెంట్ పూర్తయింది. తలకు అమర్చిన హెల్మెట్ తీసేసి, పక్కన పెట్టి "మీ అబ్బాయి లేవటానికి మరో అరగంట పడుతుంది. బయట కూర్చోండి " అంటూ వేరే పేషెంట్‌ని తీసుకుని తన గదిలోకి వెళ్ళాడు.

చంద్రయ్య బయటకు నడిచాడు. మధూహ పేషెంట్‌తోపాటు వుండిపోయింది. ఆమె ఇంకా షాక్ నుంచి తేరుకోలేదు.

హెల్మెట్ పెట్టగానే నిద్రలోకి జారుకోవటమే ఒక చిత్రం.

కానీ అంతకన్నా చిత్రమైనది.... వెన్నెముక మీద మాగ్నెట్‌తో రాస్తే తెలివితేటలు పెరుగుతాయన్నది ఎలా సాధ్యమన్నది!

ఒక మనిషి జ్ఞాపకశక్తి పెంచుకోవాలంటే దానికి ఎంతో కృషి చేయాలి. ఏళ్ళ తరబడి సాధన కావాలి. స్వతహాగా పుట్టుకతో రాని పక్షంలో ఆ శక్తి... ఎంతో కష్టం మీదగానీ అలవడదు.

అటువంటిది వారం రోజుల ట్రీట్‌మెంట్‌తో ఎలా వస్తుంది? ఈ ఆలోచన్లలో నిమగ్న మైవున్న మధూహ దృష్టి అప్రయత్నంగా హెల్మెట్ మీద పడింది.

క్రికెటర్లు బ్యాటింగ్ చేసేటప్పుడు పెట్టుకునే టోపీలా వుందది. అదికాదు ఆమెని ఆకర్షించింది- హెల్మెట్ క్రిందభాగంలో తెల్లగా ఏదో కనిపించింది. ఆమె చప్పున వంగి, దాన్ని తీసి చూసింది.

దూది!

టేబిల్ టెన్నిస్ బంతి పరిమాణంలో వుంది. ఆమె దాన్ని దగ్గరగా తీసుకుని వాసన చూసింది.

క్లోరోఫాం వాసన మందంగా వస్తోంది!!!

మధూహ ఇంకా షాక్ నుంచి తేరుకోకముందే బయట నుంచి తెలిసిన స్వరం రుద్దకంఠంతో వినిపించింది. ఆమె హెల్మెట్ విషయం ఆలోచనల్లోంచి తొలగించి, వేగంగా బయటకొచ్చింది.

బయటగదిలో, తన తల్లి....చంద్రయ్యతో మాట్లాడుతోంది. చంద్రయ్య భార్య పక్కనే కూర్చుని కన్నీళ్ళు తుడుచుకుంటోంది. వాళ్ళిద్దరూ అప్పుడే ఆస్పత్రి నుంచి వచ్చారు.

మధూహకి అర్థం కాలేదు "....ఏమైంది?" అని అడిగింది.

తల్లి మాట్లాడలేదు. చంద్రయ్య సమాధానం చెప్పలేదు. అతడి భార్య దుఃఖం మరింత ఎక్కువైంది.

“ఏమైందీ?” రెట్టించింది.

చంద్రయ్య భార్య వెక్కిళ్ళ చప్పుడు తప్ప... అంతా నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ చంద్రయ్య కంఠం వినిపించింది... “మీ అత్తయ్యకి రక్తపు కేన్సరటమ్మా”.

## 7

డాక్టర్ పార్థసారథి సానుభూతిగా వెనక్కి వాలాడు.

“ఏం లాభం లేదా డాక్టర్” మధూహ అడిగింది.

“లేదమ్మా. చాలా ముదిరిపోయింది. అదీగాక బ్లడ్ కాన్సర్ కు దురదృష్టవశాత్తు మందింకా కనుక్కోబడలేదు. కెమోథెరపీతో కొంతకాలం జీవితాన్ని పొడిగించవచ్చుకానీ ప్రయివేటు ఆస్పత్రుల్లో దానికి చాలా ఖర్చవుతుంది. మీ మామయ్య చాలా బీదవాడు అంటున్నారు.....”

“అవును డాక్టరుగారూ......”

“అందుకే ప్రయివేటు ఆస్పత్రులు వద్దు. గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసుకువెళ్ళండి. మరణం ఎలాగూ తప్పనప్పుడు. దానికి డబ్బు ఖర్చెందుకు అని నేను సలహా ఇవ్వటం తప్పేగానీ....చిన్న చిన్న రోగాలకే పెద్ద పెద్ద పేర్లు పెట్టి డబ్బులు వసూలు చేసే ప్రముఖ ఆస్పత్రులకి వెళ్ళొద్దు. రోగం అటు వంటిది అని చెపుతున్నాను”.

“అర్థమైంది డాక్టరుగారూ. అత్తమ్మని పెద్ద ఆస్పత్రిలో కనీసం ఒకరోజు వుంచగలిగే స్థోమత కూడా మాకు లేదు. ఇక ట్రీట్‌మెంట్ ప్రసక్తి ఏముంది? తనకి అంతా విపులీకరించి చెప్పారుగా?”.

"చెప్పానమ్మా. అనవసరంగా ఆశలు కల్పించటంకన్నా ఇలాటి విషయాలు ముందే చెప్పెయ్యటం మంచిది".

ఆమె లేచి నమస్కరిస్తూ...... "మీలాటి డాక్టర్లుండబట్టే మెడికల్ ప్రొఫెషన్ పట్ల గౌరవం మిగిలివుంది సార్! వెళ్ళొస్తాను"అని అక్కణ్ణుంచి కదిలింది.

ఆమె ఇంటికొచ్చేసరికి చంద్రయ్య, అతని భార్యా మళ్ళీ ఊర్నించి వచ్చి వున్నారు. ముందు గదిలో బియ్యం బస్తా వుంది.

వారు చాలాకాలం అక్కడ వుండటానికి సిద్ధపడి వచ్చినట్టు వుంది. ఆమెకి సంతోషం వేసింది. ఈ విధంగానైనా వాళ్ళ రుణం తీర్చుకోగల్గుతున్నందుకు.

"రేపే గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్ళి మాట్లాడదాం మామయ్యా" అంది.

"అక్కడ నయం కాదని డాక్టర్ పార్థసారథి చెప్పారమ్మా" అన్నాడు చంద్రయ్య.

అతడు వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకున్నందుకు ఆమె తృప్తి పడింది.

"అలా అని పూర్తిగా వదిలెయ్యలేంగా మామయ్యా. కెమోథెరపీ వలన కొంతవరకూ బాగుపడే అవకాశం వుందని చదివాను" ధైర్యం చెపుతున్నట్టు అంది.

"లేదులే తల్లీ, నేను రాజుతో మాట్లాడాను. అతను నయం చేస్తానన్నాడు".

ఆమె ముందు యధాలాపంగా వింది. ఆ తరువాత అతడు చెప్పింది అర్థమై ఒక్కసారిగా వేయి పిడుగులు తలమీద పడినట్టు కంపించి, "ఏ...ఏమిటీ?"అంది.

"అవునమ్మా. మొన్న అతడి క్లినిక్‌లో వుండగానేగా ఈ విషయం తెలిసింది! అప్పుడే అతనికి ఈ విషయం శరీరంలో ఏ భాగాన్నయినా శాసించేది మెదడేనని, గొప్ప గొప్ప ఋషులందరూ తమ మనోశక్తివలనే దేన్నయినా తమ ఆధీనంలో వుంచుకోగలరనీ చెప్పాడు. నాకూ నిజమే అనిపించింది. 'నాకే బాధా లేదు... బాధా లేదు' అని మనసుని వశీకరణ శక్తితో వశపర్చుకోగలిగినప్పుడు అది శరీరంమీద

కూడా పని చేస్తుందన్నాడు. ఉబ్బసం నుంచి కేన్సర్ వరకూ దేన్నయినా మనోశక్తి వలన తగ్గించుకోవచ్చు. ఎవరో అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఆటగాడు కేవలం మనోనిబ్బరం వలనే తన కేన్సర్ తగ్గించుకున్నాడట. మరో క్రీడాకారుడు అదేవిధంగా నయం చేసుకుని తిరిగి ఒలింపిక్స్‌లో పాల్గొన్నాడట. రాత్రిళ్ళు నిద్రపట్టకపోవడం, చనిపోయిన వారి మీద బెంగతో బాధ పడటం. తాగుడు మాన్పించటం... మెదడు తల్చుకుంటే చేయలేనిదేముంది?" అతడు చెప్పుకుపోతున్నాడు.

అతడి భాష చూస్తూంటే ఒక బీదరైతు  మాట్లాడుతున్నట్టు లేదు. అవతలివారి మాటల వలన హిప్నటైజ్ అయి, ఆ ట్రాన్స్‌లో తిరిగి ఆ మాటల్నే వప్పచెపుతున్నట్టు వుంది. అంతగా ప్రభావితమైనట్టు తోస్తూంది ఆ మాటలు వింటూంటే ...

ఆమె వినటం లేదు. భరించలేనంత నిస్సహాయతతో, ఉక్రోషంతో ఆమె కళ్ళనిండా నీరు నిండుకుంది. అది కోపం కూడా కాదు. జాలి వలన వచ్చిన ఆక్రోశం. ఆమెకి ఏం మాట్లాడాలో తోచలేదు. ఎలాగో నోరు పెగల్చుకుని, "....ఇదంతా...ఇదంతా ఎలా నమ్మేవు మామయ్యా?" అని అడిగింది.

"నమ్మక తప్పదమ్మా. అన్నిదార్లూ మూసుకుపోయినవాడు దేవుడిని ప్రార్థిస్తాడు. చిన్నదారి కనపడితే అటు ఆశగా చూస్తాడు. నేను కూడా సామాన్య మనిషేనమ్మా. అలా చూడటంలో తప్పు లేదుగా...."

"కానీ ఈ చూడటం వల్ల...." అంటూ ఏదో స్ఫురించినట్టు ఆగి "...దీనికి ఎంత ఫీజు తీసుకుంటున్నాడు అతను?" అని అడిగింది.

"మొత్తం ఆరునెలలకీ పాతికవేల దాకా అవుతుందన్నాడు"

అంతే. ఒక తెల్లవారుఝూము నిశ్శబ్దాన్ని బ్రద్దలు చేస్తూ ఫెళఫెళా రావాల్తో భూమి కదిలి పెద్ద పెద్ద భవంతుల్ని తనలో కలిపేసుకుంటున్నప్పటి దిగ్భ్రాంతితో... భయంతో..."అంత డబ్బు.. అంత డబ్బు నీకెక్కడిది మామయ్యా?" అని అడిగింది.

"పొలం అమ్మేశాను?"

"ఏమిటీ?" ఆమె గొంతు కీచుమంది. "పొ...లం.... అమ్మేశావా?"

“అవునమ్మా. నాలుగెకరాలూ అమ్మేశాను”

“మరి మీకు... ఆ తరువాత...?”

“మీ అత్తమ్మ కన్నా ఆ భూమి మాకెక్కువ కాదు. ఆవిడ బ్రతికేవుంటే కూలీ చేసుకునైనా బ్రతుకుతాం...”.